# నీతి రేఖకి యిటూ, అటూ

(కథానిక)

మొదట్లో అందరివలెనే అతనూ రోహిణి శరీరాని కాశించాడు. భిన్నాభిన్నమై, ముఠిగి, దుర్గంధ భూయిష్ఠమైన సాంఘిక వ్యవస్థకూ, ఇళ్లు, బళ్లు, పొలాలు, గౌరవం, వలెనే, ఆడవాళ్లు కూడా అద్దెకు లభిస్తారనే నియమానికి ఆశ్చర్యపడటం అనవసరం. రాత్రి ఎనిమిది గంటలప్పుడు చీకటి ఘోరాలు చేసే నీతివంతు లకునట్లే, ఆచారి కూడా రోహిణి కొంపలోకి జొరబడ్డాడు.

రోహిణి అతన్ని పైగదిలోకి తీసుకెళ్ళింది. చాలా అందంగా, ఉద్రేకపూరితంగా వుంది ఆ గది—బీరువా తలుపు తెరిచి, అందంగా బారులు తీర్చివున్న చీరలను, నవ్వుతో ఆచారికి చూపిస్తూ, 'వీటిల్లో మీకేది యిష్టమో చూడండి. ఇది బెంగాల్ సిల్కు, ఇది మైసూరు సిల్కు, ఇది జార్కెట్ సిల్కు ఇది...వీటిల్లో మీకు నచ్చిన దేదో చెప్పండి' వో పాతిక చీరలను వేలితో పైనించి కిందికి తాకింది.

'ఎందుకూ!' అన్నాడు ఆచారి.

రోహిణి కొంచెం ఆశ్చర్యంతో అతనివేపు చూసింది. అతను మాత్రం నిశ్చలంగా సిగరెట్టు పొగతో ఆడుకొంటున్నాడు. రోహిణి ఏమని వూహించుకొందో చివరికి ఒక ఆకుపచ్చ చీరను మాత్రం కట్టుకొంది. ఆచారి సిగరెట్టును కిటికీగుండా రోడ్డుమీదికి విసిరి రోడ్డు తాకిడికి రేగిన సిగరెట్ నిప్పురవ్వలు ఆరిపోయిందాకా చూసి స్తబ్ధుగా కుర్చీలో కూచున్నాడు. రోహిణి రేడియో స్విచ్ వేసింది. అమీర్ బాయి కర్నాటకీ కమ్మని గానం వినవొస్తోంది. రోహిణి పాటకు అనుగుణంగా కాలితో తాళంవేస్తూ మధ్య మధ్య సన్నగా పాటను అందుకుంటూవుంది. దాదాపు పదినిమిషాలు జరిగినయ్. ఇంత సేపటి నుండీ కళ్ళు మూసుకొని వింటున్న ఆచారి వొక్కసారి రోహిణివైపు తిరిగి 'ఆచీర ఏమంత అందంగా లేదు. పచ్చగా వున్న నీ వొంటికి నల్లటిచీర చాలా అందాన్నిస్తుంది—అవును, ఇచ్చి తీరాలి. దయచేసి ఆచీరను కట్టుకోవడానికి నీ కేవిధమైన అభ్యంతరమూ వుండదనుకొంటాను' అన్నాడు.

ఈసారి కొంచెం చురుగ్గానే చూసింది రోహిణి. తన యిరవైతొమ్మిది సంవత్సరాల జీవితంలోనూ 'దయచేసి' అన్నమాట వినడం ఇదే తొలిసారి. అసలు ఇలాంటి మాటలు అనే వాళ్లు కూడా వుంటారని రోహిణికి తెలియదు. వచ్చినవాళ్ళ ఇష్టప్రకారం నడచుకోవడానికి అలవాటుపడిన రోహిణికి ఈ మాటకు ఏమని సమాధానమివ్వాలో తోచలేదు. తోచడానికి కావలసిన సంస్కారణ రోహిణిలాంటివాళ్ళ జీవితాల్లో దొరకదు. నిశ్శబ్దంగా తెరిచిన బీరువా లోనించి నల్లటి చీరను కట్టుకొంది.

ఆచారి పది నిమిషాలు ఏకధాటిగా రోహిణిని చూసి 'బాగుంది' అని ఇంకో సిగరెట్టు వెలిగించాడు. రోహిణి రేడియోమీద వేళ్లతో మెల్లగా టికుటికు మనిపిస్తోంది. కాని రోహిణి మెదడు అతని వాలకాన్ని జాగ్రత్తగా వెదుకుతూనేవుంది. అతనిలో వొక గొప్పతనాన్ని, ఎవరిలోనూ తరుచుగా వుండనిదాన్ని తను చూస్తున్నాను అనుకొంది రోహిణి. ఆచారి సిగరెట్టును ఆఖరిసారి పీల్చి పొగను గుండ్రంగా వొదుల్తూ రోహిణిని కావలించుకొన్నాడు. విస్మయం పొందిందని చెప్పడం అతిశయోక్తి గాని కొద్దిగా చలించిన మాటమాత్రం నిజం. రోజూ తను చూసే విటులకూ ఇతనికీ మధ్య ఒక విధమైన అగాధముందని రోహిణి చూచాయగా గ్రహించగలిగింది. అతనిలో కొన్ని మానసిక ప్రవృత్తులు, దైహిక నిబంధనలు బలంగా,

వి. శార్వరి

క్రూరంగా అణచబడ్డాయనే విషయం తెలుసుకోవడానికి రోహిణికి వున్న విజ్ఞానం అంతకొద్ది సేపటిలోనే పనిచెయ్యలేదు. లైటు తగ్గించి రోహిణి అతని చేతుల్లో ఆప్యాయంగా ఇమిడింది.

* * *

ఆ తెల్లవారినుండీ రోహిణి మనసు మనసులో లేదు. రాత్రి వొచ్చిన ఆచారిని గురించి ఆలోచనలు సాగుతున్నయ్. ఆ ధ్యాసలోనే వొకసారి కాఫీలో పంచదారకు బదులు ఉప్పువేసుకొంది. తలకు నూనె రాసుకొని దువ్వుకోవడం మర్చిపోయింది. ఆనాడల్లా అతని గురించిన ఆలోచనలతోటే కాలం దొర్లింది. రోహిణి జీవితంలో ఇదొక నూతనాధ్యాయం. ఆచారి రోహిణికి కొంత మానసిక పరిశ్రమను కలిగించాడు. ఒకటి రెండు సార్లు రోహిణి అనుకొంది: 'అతను ఈ రాత్రి వొస్తే బాగుండును.'

అలాగే వొచ్చాడు. ఆదీ వారం రోజుల తరవాత.

'మళ్లీ వొస్తారనుకోలేదు' అంది రోహిణి.

'నేను మాత్రం అనుకొన్నానా?' అన్నాడు ఆచారి.

ఆరాత్రికూడా రోహిణితో గడిపి పోతూ పోతూ పది రూపాయల నోటును చేతికిచ్చాడు. ఆ నోటును చూడగానే రోహిణి కొద్దిగా కదిలిపోయింది. ఆ నోటును తీసుకోవాలనిగానీ తిరస్కరించాలనిగానీ చప్పున తేల్చుకోలేక పోయింది. అతని ఆర్థిక పరిస్థితి ఎటువంటిదో రోహిణికి తెలీదు. పది రూపాయలు ఉంటనేగాని తన ఇల్లు తొక్కడానికి వీల్లేదు అనే అభిప్రాయం అతనికి కలిగితే ఏంచేయాలో రోహిణికి తోచలేదు. డబ్బు వున్నా లేకపోయినా తన దగ్గరకు రావడానికి వీలున్నదని అతను గుర్తించాలి.

ఏది ఏమయినప్పటికీ ఈ సారి ఆచారి దగ్గర నుండి డబ్బు తీసుకోకుండానే పంపించివేసింది.

ఎంతమందో రోహిణిని చూసివుంటారు. ఎంతమందినో రోహిణి చూసివుంటుంది. ఒకతను డాబామీద మరొక అంతస్తు వేయించాడు. మరొకడు రేడియో కొనిపెట్టాడు. 'భా—' చిన్నకారు కొంటానని చేతిలో చెయ్యివేశాడు. వీళ్ళందరూ రోహిణి కంటికి భిన్నంగా కనిపించలేదు. అందరూ వొకేదాన్ని ఆశించారు.

అయితే ఆచారి మాత్రం శరీరానికి ఆశపడలేదనుకోవడం వెర్రితనం. ముందు ముందు ఏమయినప్పటికీ ఇంతవరకూ ఆతను చెల్లించిన పది రూపాయలూ రోహిణి శరీరానికి మాత్రమే. హృదయాలను ప్రేమించడం, నిష్కళంక, అకలంక, స్వచ్ఛంద, నిర్మల ప్రేమలు ఇందులో ఏమీ లేవు. అతనికి ఆడది అవసరమైంది.

ఐదవసారి వొచ్చినపుడు ఆచారిని చాలా బలవంత పెట్టింది రోహిణి.

'ఏమో! నాకు చెప్పదగ్గంత వుత్సాహం లేదు' అన్నాడు ఆచారి.

'ఎందుకు లేదు? ఎక్కడో వుండి అవస్థపడేదానికంటే శుభ్రంగా ఇక్కడే వుండిపొండి. ప్రత్యేకంగా మీరు గదికి చెల్లిస్తున్న తొమ్మిది రూపాయలు కలిసొస్తాయి. ఈ లంకంత ఇంట్లో నేనొక్కదాన్ని బిక్కుబిక్కుమంటూ వుండనవసరం కూడా వుండదు. నాకు తోడుగా వుందురుగాని' అంది రోహిణి.

'నాకు నిశ్శబ్దం చాలా అవసరం రోహిణీ! ఏమాత్రం గోలగా వున్నా నేను సహించలేను! కూడూ నీళ్లూ మానుకోగలను, చివరకు కాఫీ, సిగరెట్లు కూడా. ముఖ్యం అది నాకు కావాలి.'

'ఈ యింట్లో నేనూ పనిమనిషీ తప్పితే ఎవరూ లేరు. మేం చిన్న వాళ్లం చితకవాళ్లం గాదు గాబట్టి గోలచేస్తామనే భయం మీకనవసరం. నిజంగా నిశ్శబ్దమనేది మీకంటే ఎంతో ఎక్కువగా నాకు కావాలి.'

'ఆ కండిషన్ మీదనే నీ ఇంట్లోకి మారుతున్నాను. పై అంతస్తులోని దక్షిణపు గదిని శుభ్రం చేయించు. సాయంత్రం సామాను తెస్తాను.'

ఆచారి ఆయింట్లో ప్రవేశించిన వారం రోజులకు జ్వరపడ్డాడు. మొదట్లో దాన్ని అషామాషీ క్రింద తోసేసి తిరిగినా నాలుగు రోజులకే అది మలేరియా కిందికి దింపింది.

'మీ నాన్నా వాళ్ళకు వుత్తరం రాయమంటారా?' అంది రోహిణి.

'ఎందుకూ వుత్తరం? రాసినా అది చదివి కాసిని కన్నీళ్లు కార్చడంకంటే వాళ్లు చేయగలిగిందేమీ లేదు. అయినపుడు వాళ్ళ మనస్సు క్షోభింపచేయడం అనవసరం.'

రోహిణి మారుమాట లేకుండా వెళ్లింది.

జ్వరం రోజురోజుకీ తీవ్రం కాసాగింది. ఒకళ్లిద్దరు డాక్టర్లు మారారు. రోహిణి కంటికి కునుకు లేకుండా రాత్రింబగళ్లు ఆచారి మంచం దగ్గరే వుండిపోయింది. దేవుళ్ళమీద నమ్మకం లేకపోయినా ఆచారి జ్వరం తగ్గితే కొంత కొంత లంచం ఇస్తానని దేవుడికి అపీల్ చేసింది. రోహిణి అపీల్ దేవుడు అంగీకరించాడు. డాక్టరు రూపంలో వొచ్చి నాలుగు ఇంజక్షన్లు యిచ్చి జ్వరాన్ని తగ్గించాడు.

రోహిణి చాలా తెలివైన పని చేసింది. ఆచారిని బలవంతపెట్టి తనగదికి మార్పించక పోతే వాడికేమిటి? ఇంత రోగంతో వూరికి దూరంగా ఆచెట్ల తోపులో పడివుండేవాడు. దురదృష్టవశాత్తూ అంతవరకూ ఆచారికి స్నేహితులంటూ ఎవరూ లేరు—పరిచితులు మినహా. అతను రోహిణి ఇంటికి మారకుండా ఉన్న పక్షంలో నానాఇబ్బందులూ పడేవాడు.

అయితే రోహిణి ఇదంతా ఆలోచించి చేయలేదు. ఆవిడ దైవజ్ఞురాలుగానీ, కనీసం వాళ్లకు సంబంధించింది గానీ కాదు. ఆచారిని విడిచి ఆమె బ్రతకలేదు. ఏవో మధురకాంతులు ఆమెగుండెల్లో వెలిగించాడు. చాలా విచిత్రమైన మనిషి. సర్వసాధారణానికి భిన్నంగా వున్న దానిని చూడాలనీ సొంతం చేసుకోవాలనీ ప్రతి వారికీ వుండడం సహజం. ఆచారిమీద ఇంత 'ఇది' కలగడానికి ఈ థియరీయే పనిచేసింది.

ఒకనాడు మాటల సందర్భంలో రోహిణి ఆచారిని అడిగింది: 'మీకు వివాహమైందా?' అని.

అంతవరకూ సంతోషంగా మాట్లాడుతున్న ఆచారి ముఖం కళ తప్పింది. ఏదో చెప్పరాని బాధ పడుతున్నట్లుగా కనబడ్డాడు. రోహిణి కొంచెం కలవరపడ్డది. ఆప్రశ్న అతన్ని అంతగా బాధపెడుతుందని రోహిణి ఎప్పుడూ అనుకోలేదు: అయితే రోహిణి కొంచెం పట్టుదలను కూడా చూపాలనుకొంది. ఈ విషయమై ఇంత వేదన పడడం ఎందుకు? అసలు ఏ విషయాన్ని గురించైనా ఆచారి బాధ పడటం సహించలేని స్థితిలో వుంది. అయితే వొకటి. ఆ కారణాలేమిటో తను తెలుసుకోవాలి. వాటిని పరిష్కారం చెయ్యడానికి తను తీవ్రంగా ప్రయత్నించాలి.

'కాలేదు' అన్నాడు- బరువుగా.

'ఎందుకని?'

'నేను పెళ్ళి చేయించుకో దలచుకోలేదు. చేసుకో దలిచాను.'

రోహిణి కాసేపు ఆలోచించిన తరవాతగాని ఆ రెండింటికీ వున్న భేదాన్ని కనుక్కోలేక పోయింది. అదీ అస్పష్టంగా.

'పెళ్ళి అనేది జీవితాంతం వరకూ నిర్వహించ వలసిన పవిత్ర బాధ్యత రోహిణీ! ఆ బాధ్యతను వొకరిచేతరుద్దించుకోవడం అనుచితం. తనకు తానై విధించుకోవాలి.'

'పోనీ ఆ పనైనా మీరెందుకు చేయరూ?'

'ఒక బండి నడవడానికి రెండు చక్రాలూ సమానమైన స్థితిలో వుండాలి. ఒక చక్రం బాగావుండి మరొకటి దానికి విరుద్ధంగా వుంటే బండి నడవడం దుర్లభం. దాదాపు దాంపత్యమన్నా ఇంతే. భార్యాభర్తలిద్దరూ వొకరికొకరు ఇష్టమవాలి. దానికి కొంత పరిచయమూ స్థయిర్యమూ అవసరం. ప్రస్తుతంలో ఇవి రెండూ సంభవం కావు.

రోహిణి అతని మాటలను చురుగ్గా పరిశీలిస్తోంది. వాటినన్నిటినీ నెమరుకు తెచ్చుకోవడానికి తంటాలు పడుతోంది.

'ఆకర్షణలేని జీవితాలు నిరర్థకాలు. ఏ మోహమూ, ఏ ఆకర్షణా లేకుండా పందుల్లాగా కుళ్లుముఖాలతో ఎట్లా బ్రతకడం? బ్రతికిన నాలుగురోజులూ వెలుగులో బ్రతకాలి. ప్రేమ లేని సహచర్యంకంటే దౌర్భాగ్యం మరివుండదు.'

నిజానికి ఈమాటలు కొన్ని రోహిణికి అర్థం కాలేదు. 'ప్రేమ' అంటే ఏమిటో ఆమెకు తెలియదు. కొన్నికొన్ని పుస్తకాల్లోనూ, కొన్ని కథల్లోనూ ఈమాట రోహిణి చదివింది. కాని వాస్తవిక జీవితంలో దాని ప్రభావం ఎటువంటిదో అసలే తెలియదు. ఒక రోహిణికే గాదు. చాలామందికి దాని విలువ తెలియదనే చెప్పాలి. చలంగారన్నట్లు: భర్త భార్యకేసి చూచి 'నిన్ను ప్రేమిస్తున్నాను' అంటే ఆవిడ పడకగది వేపు చూస్తుంది. ప్రేమ అనేదానికి అంతకంటే ఎక్కువ ఖరీదు ఇవ్వడం మనకు చాతగాదు.

ఇక్కడ మన కథానాయకుడు కూడా ప్రేమకు అంతే ఖరీదు ఇచ్చాడు. ప్రస్తుత సమాజంలో విరివిగా ఖర్చవుతున్న 'కామం' 'అవసరం' అనేవాటికే ఈ ప్రేమ పెయింట్ పూయబడిందని ఆచారి కూడా గ్రహించలేదు. బజారునుండి ఇంటికి రాగానే 'ప్రియతమా! నీ కోసం చూచిచూచి వేచి వేచి కళ్లు కాయలు కాసిపోయాయి, అనేవాళ్ళు దొరకాలంటే లాభం లేదు. ఇల్లాంటివాళ్లు గ్రంథాల్లోనూ కవుల బుర్ర లోనూ మాత్రమేవుంటారు. అల్లాంటివారికోసమే ఇదివరకు ఆచారి చూశాడు. వాస్తవిక లోకంలో అదృశ్యరూపులుగాబట్టి వాళ్లు ఆచారికి కనిపించ లేదు. తనకున్న సంస్కారంతో వాడొక కొలత బద్దను తయారుచేసుకొన్నాడు. దానితో ప్రతి వాళ్లనూ కొలవడమూ, నిరాశ పొందడమూనూ. ఎందుచేతంటే ఆ కొలతలు మామూలువి కావు.

రోహిణి ఆచారి చెప్పినదాన్ని ఖండించింది. అయితే ఈపైవిషయాలన్నీ తెలిసి మాత్రంగాదు.

'ప్రేమించుకొని, వొకరి కొకరు ఇష్టమయి చేసుకొన్న పెళ్లిళ్లు ఎన్ని భగ్నం కాలేదు! దాని కేమంటారు?'

'అది వేరే విషయం. తాము చేసిన పనికి శిక్ష అనుభవించడంలో వొక రకమైన తృప్తి వుంటుంది. ఎవరో చేసిన దానికి నిరపరాధులైన వీళ్లెందుకు శిక్షింపబడాలి?'

ఈ ధోరణిలో చర్చ సాగింది. తర్జన భర్జనలు జరిగినయ్. ఖండన మండనాలు జరిగినయ్.

సారాంశం ఏమిటంటే ఆచారికి పెళ్లిమీద అసలు ఇష్టమే లేదుట. తన కొల బద్దలకు సరి పోయే ఆడది దొరికితే అప్పుడు ఆలోచిస్తాడట. 'మరి నేను సరిపోయానా?' అని రోహిణి అడి గిన ప్రశ్నకు సూటిగా ఏమీ చెప్పలేదు. సంఘం మీద విసుగెత్తి కసి తీర్చుకోవడానికి ఈ పంథా అనుసరించాడట. ఈ సందర్భంలో ఎవరెన్ని చెప్పినా వినడట. అసలు విన దలచుకోలేదట.

* * *

ఆచారి వివాహాన్ని గురించి వాడి తలి దండ్రులు చాలాతొందరపడడం ప్రారంభించారు. అసలు ఈ తొందరపాటు వాళ్లకు కలిగి రెండు సంవత్సరాలైంది. అప్పటినుండీ వాళ్లు ఆ ప్రయ త్నంలోనే వున్నారు. కొంతమంది పిల్లలు, తల్లికి నచ్చలేదు. కొంతమంది తండ్రికి నచ్చ లేదు. ఇద్దరికీ నచ్చినవాళ్లు రామచంద్రానికి నచ్చలేదు. రామచంద్రానికి నచ్చితే ఆచారి కూడా నచ్చుతుందని వాళ్లకు తెలుసు. కావడా నికి ఆచారి తమ కొడుకే అయినా రామచంద్రం చెప్పందే ఏ పనీ చేయడని వాళ్లకు గట్టి నమ్మకముంది. వాళ్లిద్దరకూ వున్న స్నేహం అలాంటిది.

ఆచారి తల్లి తాయారమ్మ ఒకసారి తన పుట్టిం టికి పోయి అప్రక్కనే వున్న మరొక పల్లె టూల్లో వొక పిల్ల వుంటే చూసింది.

'పోనీ ఈ సంబంధం మాట్లాడదాం' అన్నాడు ఆచారి తండ్రి. భార్యా భర్త లిద్దరూ కలిసి రామచంద్రంతో ఈ సంగతి చెప్పారు.

'నాకు నమ్మకం లేదు. వాడి భావాలు వేరు. వాడి లోకం వేరు. ఇంతవరకూ నా మాటను ఎదిరించని మాట నిజమే! 'పెళ్లి' అంటే ఏమిటో వాడికి తెలుసు. ఈ సంద ర్భంలో నామాటమీద గురి వుంచుతాడనుకోను. అయినా ప్రయత్నం చేస్తాను. ఈవూటే వుత్తరం రాస్తాను' అన్నాడు రామచంద్రం.

రామచంద్రం రాసిన వుత్తరం కేరాఫ్ రోహిణికి అందిన రోజున ఆచారీ రోహిణీ కొంచెం వాదనపడ్డారు. ఆ సందర్భాన్ని పుర స్కరించుకొని ఆచారి వొక చిన్న లెక్చ రిచ్చాడు.

'నా వివాహంగురించి ఎవ్వరూ జోక్యం చేసుకోవడం నేను సహించను. నా విషయం నాకు పూర్ణంగా తెలుసు. నావిషయం నాకంటే మీకే ఎక్కువగా తెలిసినట్లు మీరంతా ప్రవ ర్తించడం చూస్తూంటే ప్రతి మనిషికీ కొంత మూర్ఖత వుండడం తప్పదేమో ననిపిస్తుంది. కానప్పుడు నన్నుగురించి మీకే ఎక్కువ తెలిసి నట్లు మీరు చరించడానికి అవకాశమే వుండదు. దీన్నిగురించి నన్నెక్కువగా వొత్తిడి చేయడం భావ్యంగాదు. మతిలేని భార్యకంటే బ్రహ్మ చర్యం చాలా నయం. పశువులాంటి ఆడది నాకు అనవసరం...' ఈ ధోరణిలో సాగింది.

రోహిణి నిశితంగా ఆచారి ముఖంలోకి చూసింది. అతని హృదయంలోని భావాలను

చదవడానికి ప్రయత్నించింది. కాని అవి సాధారణ లిపిలో లేవు.

'నీలో నీవనుకొంటున్నంత గొప్పదనం ఏమీ లేదు. నిజానికి నీకేం కావాలో సరిగా నీకే తెలియదు. వొకళ్లు చేసిపెట్టాలి. మరొకళ్లు ఆలోచించి పెట్టాలి. సొంతంగా ఏనిర్ణయానికీ నువ్వు రాలేవు. ఎవరో నిర్ణయించినదాన్ని తుచ తప్పకుండా చేయగల్గువు. పెళ్లి నీకెందుకు అక్కర్లేదు? పెళ్లాన్ని పోషించలేవా? ఆ భయం నీకనవసరం. నా ఆస్తిలో కొంత భాగం నీకు రాసిస్తాను. అయినా నీ తెలివితేటలు సక్రమ పద్ధతిలో వినియోగిస్తే నా ఆస్తికూడా అనవసరమే! ఆడదంటే అంత అసహ్యం కలిగినవాడివి బ్రహ్మచర్యం పూనరాదూ? పాదల డబ్బు తల్లిదండ్రులకు తెలియకుండా పాడుచేశానని నీవే చెప్పావుగా? మరి ఈ దొంగతిళ్లెందుకు? పశువులాంటి ఆడవాళ్లు నీకు పనికి రారని అన్నావు. నీవు పొందిన ఆడవాళ్లంతా మనుష్యులే గా! నీకు కులభేదాలు లేవుగా? మరి వాళ్లను ఎందుకు పెళ్లి చేసుకోలేదు? పిచ్చిపిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు. కన్నూ కాలూ వున్నంత వరకూ ఫరవాలేదు. ఏరోగమొచ్చినా రొష్టు వచ్చినా ఎవరు చూడాలి? మొన్నవచ్చిన మలేరియాకు నేనున్నాను గనక సరిపోయింది. లేకపోతే నీగతేం కాను? భవిష్యత్తును ఆలోచించకుండా గాలిమేడలు కట్టబోకు. అందులో నాసంగతిని గురించి నీ మిత్రుడికి రాశావు. అతను నామూలంగానే నీవు చెడిపోతున్నావనీ, వివాహానికి వొప్పుకోవడం లేదనీ భావిస్తే భావించవొచ్చు. కనీసం నామీది గౌరవంచేత నయినా పెళ్లిరా. తరవాత సంగతి చూసుకొందాం.'

రోహిణి ఇచ్చిన ఈ లెక్చరుకు ఆచారి చిత్తయిపోయాడు. ఇంత గట్టిగా తనను గురించి మాట్లాడుతుందని ఆచారి ఎప్పుడూ అనుకోలేదు. రోహిణి ఆచారిప్రమాణానికి పెట్టె సర్దుతోంది. ఫిలిం రీలులాగా రోహిణి వుపన్యాసం ఆచారి కళ్లల్లో కదులుతోంది. రోహిణి చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు. ఎంతకాలం తను పరాయి ఆడవాళ్ళతో గడపడం? వెంటనే అతనికి తన ఆదర్శాలు జ్ఞాపకానికొచ్చాయి. మనసు వూయలలాగా వూగుతోంది. వెళ్ళడమా? మానడమా?

రోహిణి సర్దిన పెట్టెను తీసుకొని 'రా. స్టేషను దాకా వొస్తాను' అంది.

ఇద్దరూ గుర్రబ్బండీలో స్టేషను కొచ్చారు. బండికి ఇంకా గంట ఆలస్యముంది. ప్లాట్ ఫారం చివరకు తీసుకెళ్ళి ఈ గంట సేపూ బోధించింది రోహిణి. రైలు కదలబోయేటప్పుడు రోహిణి కళ్ళల్లో నీళ్లు తిరగడం ఆచారి గమనించలేదు.

* * *

ఆచారి వాళ్ళనాన్నా, రామచంద్రం కలిసి పిల్లను చూడడానికి వెళ్ళారు. తోవపొడుగునా వివాహ ప్రాశస్త్యాన్ని గురించి రామచంద్రం వుపన్యాసాలిస్తూనే వున్నాడు. వాటి నన్నింటినీ ఆచారి వింటున్నాడని మనం అనుకోకూడదు. వాడి మనసంతా రోహిణిమీద పీకుతున్నది.

మామూలు మర్యాదలు చేశారు. ఆచారి చేస్తున్న పనీ, జీతం, ఖర్చు నెలాఖరుకు ఎంత మిగిలేదీ అంచనా కట్టాడు పిల్ల తండ్రి. కోటయ్యగారిని వాళ్ళకున్న భూములూ, ఇళ్లూ, రాబడి వగయిరాలు అడిగాడు.

భోజనానంతరం బైట వరండాలో మంచాలు వేశారు కిటికీకి సూటిగా.

'ఇక్కడ ఎందుకేశారో తెలుసా?' అన్నాడు రామచంద్రం.

'తెలియదు' అన్నాడు ఆచారి.

'ఆడవాళ్లు నిన్ను కిటికీలోగుండా చూడడానికి.'

'అయితే ఎంతమంది చూడడం?'

'చాలామంది.'

రామచంద్రం అన్నట్టుగానే చాలామంది వొచ్చి చూశారు. కొంతమంది మగవాళ్లు కూడా చూశారు. పిల్ల చూసింది. పిల్ల అక్కయ్య చూసింది. పిల్ల చెల్లెలు చూసింది. సరే ఇక పిల్ల తల్లి కూడా చూసింది.

వీళ్లంతా తనను చూస్తున్నారని ఆచారికి తెలియదు. వీళ్ళంతా తనను చూడడానికే వొచ్చారని కూడా తెలియదు. ఎట్లా తెలుస్తుంది? వొకళ్లు 'రోకలి' కోసం వొచ్చారు. ఇంకొకళ్లు 'గిన్నెడు నెయ్యి బదులు' కోసం

వొచ్చారు. మరొకళ్లు 'కంట్లో నలక తీయించు కోడానికి' వొచ్చారు.

ఈ వొచ్చినవాళ్ళందరూ తమ పనులేమిటో చూసుకోకుండా ఆచారివైపు దీక్షగా చూసి లోపలికి పోతున్నారు. లోపలికి పోయిన వాళ్లు పిల్లతల్లితో గుసగుసలాడడం ఆచారి విన్నా వినక పోయినా రామచంద్రం మాత్రం శ్రద్ధగా విన్నాడు.

కోటయ్యగారూ పిల్ల తండ్రి సొమ్ములూ సంబంధాలు మాట్లాడుకొంటున్నారు, ఆచారి నిద్రలేచేటప్పటికే.

'ఆవిషయం నాకు తెలియదు. మీ అప్పా చెల్లెళ్లు ఏం మాట్లాడుకొంటారో ఏమో?' అన్నాడు పిల్లతండ్రి కోటయ్యగారితో.

కోటయ్యగారు నవ్వుకొని 'అమ్మాయ్' అంటూ ఇంట్లోకి పోయాడు.

'ఇదంతా ఏమిటి?' అన్నాడు ఆచారి.

'వాళ్లు నీకు పిల్లనివ్వడానికి వొప్పుకొన్నారు. సొమ్ము సంగతి ఇప్పుడు నలుగుతూవుంది.' అన్నాడు రామచంద్రం.

'అబ్బాయ్! పెళ్లి చేసుకోవలసింది నేను. ఇంత వరకూ ఆ పిల్ల ఎట్లా వుంటుందో నేను చూడలేదు. వీళ్లప్పుడే సొమ్ముదాకా పోయారు. నా ఆదర్శాలకు సరిపోయే వాళ్లు దొరకరు. కనీసం దానికి నాలుగు మెట్లు దిగువనన్నా వుండాలి. చూసిన తరవాత ఈ పిల్ల నాకు నచ్చకపోతే ఈ మాట్లాడుకొన్నదంతా వృథా కావాలి సొస్తుంది. ముందు పిల్లను నేను చూడాలి. ఆ మీద ఏం మాట్లాడుకొన్నా ఏం చేసినా' అన్నాడు ఆచారి.

రామచంద్రం పిల్ల తండ్రితో ఈ సంగతి చెప్పాడు. పిల్ల తండ్రి పిల్ల తల్లితో చెప్పాడు. ఆమెగారు గంటన్నరసేపు కూతుర్ని ముస్తాబు చేసి పంపింది. ఆచారి చూశాడు. చామన చాయగా వుంది. సన్నగా కొంచెం పొట్టిగా వుంది. తలవాల్చుకొని వుండడంచేత ముఖం సరిగ్గా కనిపించలేదు. 'ముఖం కొంచెం ఎత్తు' అందామనుకొన్నాడు గాని రామచంద్రం 'అట్లాంటి మాటలు అనగూడదని' చెప్పిన మాట జ్ఞాపకం వొచ్చి ఆగాడు.

'పొద్దుపోకబోతూవుంది' అని ఆచారీ రామచంద్రం బయలుదేరారు.

'పిల్ల ఎట్లా వుందిరా?' అన్నాడు కోటయ్య కొడుకు ముఖాన్ని ఆపుర్దాగా భయంగా చూస్తూ.

ఒక్కక్షణం తండ్రి ముఖం చూశాడు ఆచారి. ఆ ముఖంలో కనిపించిన 'పితృప్రేమ' అతని గుండెల్ని కదిలించింది. 'కానివ్వండి' అని బయలుదేరాడు బరువుగా.

* * *

ఆయిదవ రోజుకల్లా ఆచారి రోహిణి దగ్గర కొచ్చాడు. రోహిణి నవ్వుతూ అతని చేతిలోని పెట్టె నందుకొని బల్లమీద పెట్టి 'పోయిన పని కాయా పండా?' అంది.

'కాయాగాదు పండూగాదు' అన్నాడు ఆచారి ముక్తసరిగా.

'పిల్లను చూశావా?'

'పోయింది అందుకేగా?'

'ఎలా వుంది?'

తాను రోహిణి నుండి పోయింది లగాయతు తిరిగి వొచ్చేదాకా జరిగిన సంగతులన్నీ చెప్పాడు.

'ఫర్వాలేదు. ఆమాత్రం చదువుకొన్నదీ అంటే దానిమీద ఎంతయినా అభివృద్ధి చేసుకోవొచ్చు. ఇకనుండి శ్రీవారు రోహిణి గడప తొక్కరు గాబోలు' అంది రోహిణి.

'విసిగించబోకు రోహిణీ' అంటూ చిరాగ్గా కుర్చీలో కూలబడ్డాడు ఆచారి.

రోహిణి హృదయం ఇప్పుడు కొంచెం తృప్తి పడింది. తన సొంత వ్యవహార మేదో చిక్కులు తీరి తెరపిన బడ్డట్లుగా వుంది. నాశనంవైపు అతి వేగంతో పురోగమిస్తున్న వొక వ్యక్తిని మరల్చగలిగాననే సంతోషం వరవరా కట్టి పోయింది.

నాలుగు నెలలు గడిచినా కోటయ్యగారి నుండిగానీ, రామచంద్రంనుండిగానీ, ఏ విధమైన కబురూ లేదు.

'చిట్టిపోయిందా?' అంది రోహిణి విచారంతో.

'నాకుమాత్రమేం తెలుసు!' అన్నాడు ఆచారి. ఈ విషయంమీద రోహిణి పూర్తిగా నిరాశ చేసుకొంది. మళ్ళీ కొత్త ప్రయత్నం చేయాలి. తన స్నేహితురాలొకసారి ఎక్కడో

వొక పిల్ల వున్నట్టు చెప్పినగుర్తు రోహిణికివుంది. ఆ స్నేహితురాలుని పిలిచి విషయాన్ని చెప్పి "ఆ సంబంధం మాట్లాడవోయ్" అంది.

'ఎందుకు రోహిణీ నేనంటే నీకంత శ్రద్ధ? నానుండి ఏం ఆశించి? డబ్బా కాదు. రూపమా కాదు! విద్యా కాదు. నిర్నిమిత్తంగా ఎందుకీ శ్రమ? ఒకసారి ప్రయత్నించావ్. అది విఫలమైపోయింది. మళ్లీ ప్రయత్నం అనవసరం. పరిస్థితులుగూడా నాకుఅనుకూలమే అవుతున్నయ్. ఎందుకూ నీ దేవుళ్లాట?" అన్నాడు ఆచారి.

'నీనుండి వొకదాన్ని ఆశించిగాదు, నిన్నే ఆశించిచేస్తున్నాను. నీక్షేమంకోసం నేను సర్వనాశనమైతాను. ఎందుకో అంతబలంగా నాలో నాటుకుపోయావు' అంది రోహిణి.

ఒకనాడు హఠాత్తుగా రామచంద్రం వచ్చాడు.

'ఏమిటి విశేషాలు!' అన్నాడు ఆచారి.

'అంతా కులాసా. మరీ ఇంత చిక్కిపోయావేం!' అని 'మరి బయల్దేరు. లగ్నం ఇంకా నాలుగు రోజులే వుంది' అన్నాడు రామచంద్రం.

'ఏం లగ్నం?' అన్నాడు ఆచారి అదిరిపోయి.

'పరాచకాలకు అవకాశం లేదు ఆచారీ! అవతల పెళ్లి పనులు సర్దుకోవాలి. పన్నెండు గంటల బండి పట్టుకొంటే వుదయానికికన్నా కొంపకు చేరొచ్చు.'

'ఎవరిదీ?'

గూబ 'గుయ్' మంది దెబ్బతో.

'ఎలుక్కి ప్రాణ సంకటమూ, పిల్లికి చెలగాటమునూ. నీకోసం ఎంతమంది నశించాలి? కన్నందుకు తల్లీ తండ్రీ, స్నేహితుణ్ణయినందుకు నేనూ, చేరదీసినందుకు రోహిణీ. నీ వొక్కడి కోసం ఇంతమంది కన్నీళ్ళు కార్చడం నీకు శ్రేయస్కరంకాదు. భవిష్యత్తులో విలపిస్తావ్. మించి పోయిన తర్వాత చేయగలిగిందేమీ వుండదు. జాగ్రతగా ఆలోచించుకో' అన్నాడు రామచంద్రం.

ఆచారి జాగ్రత్తగానే ఆలోచించాడు. తన జీవితం నాశనంవల్ల నాలుగు ప్రాణాలు సంతోషిస్తాయ్. తన సుఖం కోసం (!) ఇంత మందిని హింసింపడంకంటే ఇంతమందికోసం తనొక్కడే హింసింపబడడం మంచిదిగా తోచింది. రోహిణితో చెప్పి బయలు దేరాడు.

* * *

పెళ్ళి పనులు ఆడావుడిగా జరుగుతున్నయ్. చుట్టాలు భోజనాలు చేస్తున్నారు. కొందరు అన్నానికి రాకుండా పేకలో పడ్డారు. పిల్లలు ఇల్లంతా గలభా చేస్తున్నారు. అంతా వుత్సాహంగా వుంది.

ఆచారి మాత్రం వీటికి అతీతంగా వొక మూలగా కూచున్నాడు. అతనిలో ఏవిధమైన తత్వమూ పని చెయ్యడం లేదు. రకరకాల చిత్రాలు కళ్ళముందు తిరిగిపోతున్నయ్. అంత ఇదిలోనూ ప్రతి పావుగంటకూ అతనికి రోహిణి తలుపుకొచ్చి కళ్ళనీళ్ళ పర్యంత మయ్యేవి. ఆఖరికి మంగళసూత్రం కట్టబోయే ముందు రోహిణి జ్ఞాపకానికొచ్చింది. వేడి కన్నీటిబొట్లు రెండు జారినయ్.

'చమటగావుంది విసనకర్ర అందుకోండర్రా' అంది వొక ముత్తయిదువ.

ఆరాత్రల్లా ఆచారికి మనసు మనసులో లేదు.

'ఏమిట్రా?' అంది తల్లి.

'వేడి చేసింది' అన్నాడు.

'మజ్జిగ తాగు నాయనా. చప్పున తగ్గిపోతుంది' అన్నారు ఒకరు.

మూడు నిద్రలకు కాంతం, ఆచారీ వాళ్ళ మేనమామ ఇంటికొచ్చారు. తొలిరోజు సరదాగానే గడిచిపోయింది. రెండవరోజు మధ్యాహ్నం ఆచారి భోజనానికి కూచున్నాడు. మజ్జిగ పోయబోయేసరికి ఎవరూ లేరు.

'అమ్మా' అని పిలిచాడు ఆచారి.

ఎవరూ పలకలేదు. గాని వొక నీడమాత్రం కదిలింది. 'మజ్జిగే!' అన్నాడు' నీడను తల్లి అనుకొని.

'కాంతం తలదువ్వుకొని దువ్వెన ఇంట్లో పెట్టడానికొచ్చింది. ఆచారికి మజ్జిగ కావాలి. ఆడవాళ్ళంతా బైట ఏదో పనుల్లో వున్నారు. పిలుద్దామనుకొని రెండడుగులు వేసింది.

'ఒక్కరూ పలకరేం?' అన్నాడు పెద్దగా.

'ఏమిటండీ?' అంది కాంతం. భర్తతో పలకడం అదే మొదలు.

'నువ్వా? మజ్జిగ కావాలి, పోస్తే నే పోసుకొంటాను.'

'నేపోస్తాను-'

మజ్జిగ వొడ్డించింది. ఇద్దరి కలలూ ఢీఢీక్కీ అయినై. ఆచారి వొళ్లు జలదరించింది. నెత్తురు తిమ్మిరెక్కింది. కాంతం మజ్జిగ వొడ్డించి పోబోతూవుంది.

'కొంచెం అన్నం కావాలి' అన్నాడు

అన్నంపెట్టి నవ్వుతో తంగేడు పొదలా వెళ్లింది. ఆచారికి నిజంగా పిడికెడు మెతుకులు చాలు. ఆ అన్నమంతా తిన్నా ఇంకా ఆకలిగానేవుంది, 'పోనీమళ్లీ పిలుద్దాం' అనుకొన్నాడు.

'ఏం నాయనా' ఒక ముసలమ్మ వొచ్చింది.

'ఏంగావాలి?'

'ఛీ ఛీ ఇదీ ఇప్పుడే తగలడాలీ?' అనుకొని 'ఏమీ లేదులే' అంటూ లేచాడు.

ఆ ఢీఢీక్కని చురకత్తిలాటి ఆ నవ్వును ఆచారి చాలా భద్రంగా తన హృదయంలో దాచుకొన్నాడు.

ఈ అనుభవంతో అతని దృష్టి కాంతంవేపు మళ్లింది. అసలు కాంతానికీ తనకూ సంబంధమేమిటి? ఆపిల్ల తనకోసం ఆపని ఎందుకు చెయ్యాలి? ఆసాన్నల్లోకి చాలామందికి మజ్జిగ అవసరం. వాళ్లందరకు పొయ్యదేం? తనలో ప్రత్యేకతేమిటి?

ఈ ఆలోచనలతో కాంతం ఫొటో అతని మెదడులో మెరవసాగింది. తను పొందిన అనేక స్త్రీలకూ కాంతానికీ కొంత భేదం వున్నదనే సంగతి వాడికి తెలియసాగింది. కాంతంకంటే అందమయినవాళ్లూ, చదువుకొన్నవాళ్లూ ఆచారి చేతులు దాటిపోయారు. కాని కాంతానికీ వాళ్లకీ మధ్య కొన్ని అగాధాలున్నాయి. ఒక ప్రత్యేక విశిష్టత వాడికి కాంతంలో కనిపించింది. ఈవిషయం మరింత స్పష్టంగా వాడు రెండవ సారి అత్తగారింటికెళ్లినప్పుడు గ్రహించగలిగాడు. ఈ సందడిలో వాడికి రోహిణి విషయం జ్ఞప్తికి రావడం చాలా భాగం తగ్గిపోయింది.

* * *

కాంతాన్ని విడిచి పది రోజులుండడం వాడికి బ్రహ్మప్రళయమైంది. ఏదో విధంగా చూసి రావాలని నిశ్చయించుకొని సంచి సర్దుతున్నాడు.

'ఎక్కడికిరా?' అంది వాళ్లమ్మ.

'బెజవాడ దాకా వెళ్లొస్తాను'

'రెండు జతల గుడ్డ లెందుకూ?'

ఆచారి గట్టిచిక్కులోనే పడ్డాడు.

'అక్కడ మీటింగు వుందిలే' అని ఆ సందర్భాన్ని తప్పించాడు అతి కష్టంమీద.

ఆ పట్టు పట్టు పదిహేను రోజుల వరకూ అక్కడే వున్నాడు. ఇంట్లో చాలామంది వున్నప్పటికీ వాడు తనపనులన్నీ ఎక్కువగా పెళ్లాంతో చేయిస్తాడు. సమీపంలో మనిషి వున్నా దొడ్లో గవ్వలాడుకొంటున్న భార్యదగ్గరికి వెళ్లి 'కాంతం కాసిన్ని మంచినీళ్లివ్వు' అంటాడు.

వాడికి కావలసిన స్నో బాటిలూ, దువ్వెన, పుస్తకాలు, చివరకు సిగరెట్లుకు నిప్పుకూడా భార్యనే అడుగుతాడు. ఆ పిల్ల అది గమనించి ఇస్తే సంతోషిస్తాడు. మరెవరయినా ఇస్తే కించపడతాడు. కాంతం వాడి ఆదర్శాలకు సరిపోదు. చాలా మెట్లు దిగువగా వుంది కాని కాంతం అంటే వాడికంత ఆకర్షణ కలగడానికి సొంత వస్తువును వాడుకొనే తృప్తికీ అద్దె వస్తువును వాడుకొనే తృప్తికీ వున్న భేదమే!

వారం రోజులు గడువులతో వాడు అత్తవారింటికి తరుచుగా పోతూ వొచ్చాడు. వాడి వాలకాన్ని కనిపెట్టి రామచంద్రం ఛకాలుమని నవ్వి 'నీ అంత విచిత్రప్రాణి నాకు ఎక్కడా కనిపించలేదురా. ప్రథమంలో ఆడది పనికిరాదన్నావ్. తరవాత వాళ్ళకోసం వందలు ఖర్చుపెట్టావ్. పెళ్లివొద్దని గోలపెట్టావ్. మరి 'కార్యం' దాకా నన్నా ఆగలేక అరడజను సార్లు తిరిగావ్... ఎంత భార్యయినా అంత మరులు పనికిరావు. పిలవని పేరంటానికీ పోతే అగౌరవం. అనాహ్వానితం నీచం. మాటిమాటికి పోబోకు' అన్నాడు.

'మాటిమాటికి పోబోకు బెట్టు తక్కువ' అంది వాళ్ళమ్మ.

నలుగురూ నవ్వరూ!' అన్నాడు తండ్రి.

'వాళ్ళ కళ్ళకు లేకిగా కనపడుతాం' అన్నాడు తాత.

ఈ మాటలన్నీ అప్పట్లో వాడికి రుచించలేదు. వాడు నాలుగసారి అత్తగారింటినుండి వొస్తూ వున్నప్పుడు వాళ్ళమాటల రుచి తెలిసింది.

'ఇక మాటమాటకు రాను' అని ఫూరిబైట ఎవ్వరూ చూడకుండా చెంపలు వేసుకున్నాడు. అప్పుడు వాడికి రోహిణి జ్ఞాపక మొచ్చింది. ఇంతకాలమూ ఆపేరునన్నా స్మరించనందుకు ఏడ్చాడు.

ఆచారి వైరిర్ణయానికి రావడానికి కారణం లేకపోలేదు. వాడి షద్రకులలో వొకాయన 'పదిహేను సిగరెట్ పెట్టెలిచ్చాం' అన్నాడు. పదిహేను సిగరెట్ పెట్టెలు ఇచ్చామని ఎవడో పుల్లాయతోటి అన్న మనిషి పదిహేను రోజులు మా యింట్లో తెగ తెన్నాడని ఎందు కనడూ!

ఒకసారి వెన్న తినడంమీద మాటవొచ్చింది. 'రెండు రొట్టెలూ. అరపౌను వెన్నా వుంటే అన్నంగూడా అక్కర్లేదు' అన్నాడు ఆచారి.

'పెట్టేవాళ్లుంటే తినడాని కేమొచ్చె ఎన్నయినా తినొచ్చు' అన్నా రొకరు.

'తాటిచెట్టులాగా పెరిగాడు' అన్నారింకొకరు. మరి వాళ్లలాగే జీడిపిక్క రంగులో బుడందోసకాయలాగా గిడసబారి వుండలేదనే అసూయ వాళ్ళ కడుపుల్లో ఎంతకాలం నుండి వుందోగాని ఆనాడు బైటబడింది.

వీటన్నిటి మాటకేంగానీ కాంతం అన్న మాటే వాడి గుండెను చీల్చింది. హృదయం చివుక్కుమంది.

'ఇది వుతుకు' అన్నాడు వొక గుడ్డయిచ్చి.

'సాయంత్రం' అంది కాంతం.

సాయంత్రానికి తనిచ్చిన ఆకారంలోనే వుంది. ఆ తెల్లవారి గాబోలు వుతికింది.

'నిన్న వుతకమన్నాను' అన్నాడు.

'ఇవాళ వుతికాను' అంది.

'నిన్న ఇవాళ గాదు' అన్నాడు.

'ఇప్పుడు నామీద అలక చూపకండి. ఇక ముందు అది. నామీద యింకా మీ కధికారం లేదు' అంది కాంతం.

గుండెలు పగిలిపోయినయ్. తను ఎంతో అనురాగంతో చూస్తున్న కాంతం. దానికోసం సర్వ త్యాగాలు (?) చేయాలనుకొన్న దాని నోటినుండి ఈమాటలు! మొదడు చిరిగిపోయింది. గదిలోకొచ్చి నిశ్శబ్దంగా ఏడిచాడు.

'ఎందుకూ?' అన్నా రొకరు.

'వేడి చేసింది' అన్నాడు.

'కాసిని మజ్జిగ తాగరాదూ! అదే తగ్గుతుంది.'

వీటన్నిటినీ ఆచారి సమీకరించి చూశాడు. వాళ్లు ఇంత లేకి మనుషులనిగానీ, ఇంత తేలిక బుద్ధులనిగానీ, ఇంత క్రితం అతననుకోలేదు. కార్యక్రమం ఇప్పటికి పూర్తయింది. తాను చేయదలచుకున్న పరిశీలన లేమిటో చేసుకున్నాడు. పిలవకముందే పోతే ఎలా వుంటుందో, డబ్బులేకుండా వుంటేనూ, చనువుగా వుంటేనూ ఎట్లా వుంటుందో తేలిపోయింది. ఫలితాలు స్పష్టంగా, భయంకరంగా కనిపించినయ్.

ఆచారి బరువుగా నిట్టూర్చి వూరిబైట యిసిక కుప్పలమీద పొరగిలబడ్డాడు.

'పోయింది. అంతా నాశనమై పోయింది. నా ఆశలు, నిర్ణయాలు, దుమ్ములో కలసిపోయాయి. రక్తబంధువులాంటి రోహిణికి దూరమైనాను. నాజీవితం సముద్రంలోని పడవ. బీటలు వారిన స్మశానం...'

ఆచారి వైరిర్ణయాని కొచ్చేనాటికి వాడి వివాహం జరిగి నాలుగు నెలలైనా కాలేదు.

ఏదైనా చెట్టు కాలుతూన్నప్పుడు—ఆ చెట్టును పోషించి పెంచిన రంగులన్నీ తిరిగి ఉజ్వలంగా పెరిగి గోచరిస్తాయి. ఉవ్వెత్తున లేచే ఆ జ్వాలలో అనేక సూర్యాస్తమయాల అరుణవర్ణం, అనేక ఉషఃకాలాల గాఢ నీలిమ, చంద్రోదయంలోని సాంద్ర ధవళత, తారకాపథంలోని ప్రకాశం–అన్నీ. బాధాపూరిత పరీహాసమయాల్లో మానవ హృదయమూ అంతే; ఏది జీవితంలో ఆదరించి స్వీకరించామో అదే ప్రజ్వలిస్తుంది.